# పదో తరగతి సాంఘికశాస్త్రం

## ప్రపంచీకరణ

**1. 'విదేశీ వాణిజ్య సరళీకరణ' అంటే ఏమిటి?** *(వి.అ. 4 మార్కులు)*

జ: స్వాతంత్ర్యం పొందిన తరువాత భారత ప్రభుత్వం విదేశీ వాణిజ్యం, విదేశీ పెట్టుబడులకు అవరోధాలు విధించింది. ఆ తర్వాత 1991 నుంచి దీర్ఘకాల ప్రభావం చూపించే విధంగా భారతదేశ విధానాల్లో మార్పులు చేశారు.

★ విదేశీ వాణిజ్యాన్ని పెంచడానికి ప్రభుత్వం విధించిన పరిమితులు, అవరోధాలను తొలగించి దేశంలోకి స్వేచ్ఛగా వస్తుసేవల ఎగుమతి, దిగుమతి అయ్యేలా ఆర్థిక విధానాన్ని సరళీకరించడాన్ని 'విదేశీ వాణిజ్య సరళీకరణ' అంటారు.

★ సరళీకృత విధానాల ఫలితంగా తాము ఏం ఎగుమతి చేయదలచుకున్నారో, ఏం దిగుమతి చేయదలచుకున్నారో సంబంధిత వ్యాపారులు, వాణిజ్యం చేసేవారు స్వేచ్ఛగా నిర్ణయించుకోవచ్చు.

★ విదేశీ కంపెనీలు ఇక్కడ కార్యాలయాలు, కర్మాగారాలను స్థాపించుకోవచ్చు.

★ అంతకుముందు కాలంతో పోలిస్తే చాలా తక్కువ పరిమితులను ప్రభుత్వం విధించింది. దీన్నే 'సరళీకృత ఆర్థిక విధానం' అంటారు.

★ దీని వల్ల భారతీయ ఉత్పత్తిదారులు ప్రపంచ ఉత్పత్తిదారులతో పోటీపడి తమ నాణ్యతను మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఏర్పడింది.

**2. 'ప్రపంచీకరణ ప్రక్రియకు ముఖ్యకారణం సాంకేతిక పరిజ్ఞానం', దీన్ని మీరు ఎలా సమర్థిస్తారు? వ్యాఖ్యానించండి?** *(ఇ.పా.వ.వ్యా. 2 మార్కులు)*

జ: ప్రపంచీకరణ ప్రక్రియకు ముఖ్యకారణం సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందటమేనని చెప్పవచ్చు.

★ నేడు ప్రపంచంలో ఎక్కడ ఏ వస్తువు ఉత్పత్తి జరిగినా, దాని వివరాలు క్షణాల్లో ఇంటర్నెట్ ద్వారా వినియోగదారులకు చేరుతున్నాయి.

★ అదే విధంగా ప్రపంచంలో ఏ వస్తువునైనా మనం ఇంటివద్ద నుంచే ఆన్‌లైన్ మార్కెటింగ్ ద్వారా కొనుగోలు చేయవచ్చు.

★ సాంకేతిక పరిజ్ఞానం పెరగడం వల్ల అమ్మకందారులు వినియోగదారులతో నేరుగా సంప్రదింపులు జరిపి వారి అభిరుచులకు అనుగుణంగా సేవలు అందిస్తున్నారు.

★ దేశీయ, విదేశీ రవాణా సౌకర్యాలు వృద్ధి చెందడంతో వస్తుసేవలను తేలిగ్గా, చౌకగా, వేగంగా వినియోగదారులకు అందించగలుగుతున్నారు.

★ ఈ విధంగా ప్రపంచీకరణ ప్రక్రియకు సాంకేతిక పరిజ్ఞానాభివృద్ధి ముఖ్యకారణంగా చెప్పుకోవచ్చు.

**3. బహుళజాతి సంస్థలు పని ప్రదేశాన్ని ఎంచుకోవడానికి ఉపయోగించే సాధారణ సూచికలను తెలపండి.** *(వి.అ. 2 మార్కులు)*

జ: బహుళజాతి సంస్థలు పని ప్రదేశాన్ని ఎంచుకోవడానికి కింది సాధారణ సూచికలను ఉపయోగిస్తాయి.

★ మార్కెట్లకు దగ్గరగా ఉండటం.

★ తక్కువ ఖర్చుతో నైపుణ్యం ఉన్న, నైపుణ్యంలేని కార్మికులు లభించడం.

★ ఇతర ఉత్పత్తి కారకాలు అందుబాటులో ఉండటం.

★ ప్రభుత్వ విధానాలు తమ ప్రయోజనాలను కాపాడే విధంగా ఉండటం.

**4. ప్రపంచ వాణిజ్య సంస్థ గురించి రాయండి.** *(వి.అ. 2 మార్కులు)*

జ: అభివృద్ధి చెందిన దేశాల చొరవతో 'ప్రపంచ వాణిజ్య సంస్థ' (W.T.O.) 1995లో జనవరి 1న ఏర్పడింది.

★ దీని ప్రధాన కార్యాలయం జెనీవాలో ఉంది.

★ ఈ సంస్థలో ప్రస్తుతం 160 దేశాలు సభ్యదేశాలుగా ఉన్నాయి.

★ అంతర్జాతీయ వాణిజ్యంలో సరళీకృత విధానాలు ఏర్పడేలా చూసే ఉద్దేశంతో పనిచేస్తున్న సంస్థల్లో 'ప్రపంచ వాణిజ్య సంస్థ' ఒకటి.

★ ఇది అంతర్జాతీయ వాణిజ్యానికి సంబంధించిన నియమాలను రూపొందించి, సభ్యదేశాలు అవి పాటించేలా చూస్తుంది.

★ ఈ సంస్థ అందరూ స్వేచ్ఛా వాణిజ్యం చేపట్టేలా చేస్తుంది.

**5.** **ప్రపంచీకరణ భవిష్యత్తులో కూడా కొనసాగితే, రాబోయే ఇరవై ఏళ్లలో ప్రపంచం ఎలా ఉంటుందో ఊహించి రాయండి.**

*(స.అ.ప్ర.ప్ర.) (2 మార్కులు)*

జ: ప్రపంచీకరణ భవిష్యత్తులో కూడా కొనసాగితే ఇరవై సంవత్సరాల తర్వాత బహుళజాతి కంపెనీల నుంచి పోటీని తట్టుకోలేక దేశీయకంపెనీలు మూతపడిపోవచ్చు.

★ బహుళజాతి సంస్థల వస్తువులు, సేవలను దృష్టిలో ఉంచుకుని స్వదేశీ వస్తు సేవలపై మోజును పూర్తిగా కోల్పోయే అవకాశం ఉంది.

★ మానవ సంబంధాలు దెబ్బతినవచ్చు.

★ ప్రపంచంలోనే పేరుగాంచిన భారతీయ సంస్కృతిపై వీటి ప్రభావం పడొచ్చు.

★ విద్యా, వైద్య రంగాల్లో కూడా బహుళజాతి సంస్థలు ప్రాచుర్యం పొందవచ్చు.

★ భారతదేశంలోని పెద్ద పెద్ద ప్రభుత్వరంగ సంస్థల్లో కూడా ఇవి ప్రవేశించవచ్చు.

## ఒక మార్కు ప్రశ్నలు

**1.** **'అరబ్ వసంతం'గా దేన్ని పేర్కొన్నారు?** *(వి.అ.)*

జ: పశ్చిమ ఆసియా, ఉత్తర ఆఫ్రికాలలో ట్యునీషియా, ఈజిప్టు లాంటి అనేక దేశాలు ఒకదాంతో ఒకటి ప్రభావితమై, నియంతలను తొలగించడానికి విప్లవాలు చేశాయి. ప్రసార మాధ్యమాల్లో దీన్ని 'అరబ్ వసంతం'గా పేర్కొన్నారు.

**2.** **'ప్రపంచీకరణ' అంటే ఏమిటి?** *(వి.అ.)*

జ: దేశాలు వేగంగా అనుసంధానమయ్యే ప్రక్రియను 'ప్రపంచీకరణ' అంటారు.

**3.** **'బహుళజాతి సంస్థలు' అని వేటిని అంటారు?** *(వి.అ.)*

జ: ఒక దేశం కంటే ఎక్కువ దేశాల్లో ఉత్పత్తిని చేపట్టే లేదా ఉత్పత్తులను నియంత్రించే సంస్థలను 'బహుళజాతి సంస్థలు' అంటారు.

**4.** **ప్రపంచీకరణ వల్ల బహుళజాతి సంస్థలుగా ఎదిగిన 'భారతీయ కంపెనీలు' ఏవి?** *(వి.అ.)*

జ: టాటా మోటార్స్ (వాహనాలు), ఇన్ఫోసిస్ (ఐటీ), రాన్‌బాక్సీ (మందులు), ఏషియన్ పెయింట్స్ (రంగులు) లాంటి భారతీయ కంపెనీలు ప్రపంచీకరణ వల్ల 'బహుళజాతి సంస్థలు'గా ఎదిగాయి.

**5.** **విదేశీ పెట్టుబడులకు, జాయింట్ వెంచర్లకు మధ్య తేడా ఏమిటి?** *(వి.అ.)*

జ: భూమి, భవనాలు, యంత్రాలు, ఇతర పరికరాలు లాంటి వాటి కోసం బహుళజాతి సంస్థలు ఖర్చుపెట్టే మొత్తాన్ని 'విదేశీ పెట్టుబడులు' అంటారు.

★ కొన్ని సందర్భాల్లో బహుళజాతి కంపెనీలు ఆయా దేశాల స్థానిక కంపెనీలతో కలిసి ఉత్పత్తిని చేపడతాయి. వీటిని 'జాయింట్ వెంచర్లు' అంటారు.

**రచయిత: బొమ్మిడి నారాయణరావు**

www.eenadupratibha.net